క్లుప్తంగా

మిర్చీలు మీకు.. మీ ఓటు మాకు



రామాయంపేట హోటల్‌లో మిర్చీలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి తరఫున పార్టీ నేతలు పట్టణంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఒక హోటల్ వద్ద మిర్చీలు వేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాగరాజు కార్యకర్తలు ఉన్నారు.

నిర్ణిత సమయంలోపే ప్రచారం చేయాలి

ఎస్‌ఐ రాజయ్య



రేగోడ్(మెదక్): రాత్రి పది దాటిన తర్వాత ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రాజయ్య హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారానికి ఇంకా మూడు రోజులు ఉందన్నారు. రాత్రి 10 గంటలు తర్వాత ఎవరైనా గ్రామాల్లోని ఓటరు ఇంటింటా వెళ్లి ప్రచారం చేసినా, డబ్బులు, వస్తువులు పంచుతూ ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వీరహనుమాన్ ఆలయంలో విశేష పూజలు



ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న బాల వీరహనుమాన్ ఆలయంలో శనివారం పురోహితుడు మెట్టురాములు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి చందన అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్త భజన మండల సభ్యులు పాల్గొన్నారు.

నేడు జ్వాలాతోరణ మహోత్సవం



బగలాముఖి అమ్మవారు

శివ్వంపేట(నర్సాపూర్): జ్వాలాతోరణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నారు. కార్తీక శుక్ల చతుర్ధశిని పురస్కరించుకుని బగలాముఖీ ఆలయంలో వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం మహోత్సవం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

'ఓటు అడిగే హక్కులేదు'

నర్సాపూర్: బీసీలకు ఓటు అడిగే హక్కు ఇదే సామాజిక వర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు లేదని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాంచందర్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆయన భార్య రాజమణి బీఆర్‌ఎస్ వల్ల జెడ్పీ చైర్‌పర్సన్‌గా, తాను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎదిగారని గుర్తుచేశారు. పార్టీకి ద్రోహం చేసి ఇతర పార్టీలోకి వెళ్లారని ఆరోపించారు. కాగా ఆయన వెంట తిరిగిన బీసీ నాయకులను రాజకీయంగా, అన్ని విధాలుగా అణగదొక్కాడని ఆరోపిస్తూ ప్రస్తుతం బీసీ బిడ్డనని చెబుతూ ఓట్లు అడగటం విచారకరమన్నారు. సమావేశంలో సూరారం నర్సింహులు, షేక్ హుస్సేన్, సాగర్, దావూద్, ఆంజనేయులుగౌడ్, రవూఫ్, నాగరాజుగౌడ్, జ్ఞానేశ్వర్, శ్రవణ్‌కుమార్, అజ్మత్, సద్దాం, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, రాకేశ్‌గౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట



రంగంపేట ప్రచారంలో గాలి అనిల్‌కుమార్



తిరుమలాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీజేపీ, కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. పేదరైతుల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాయగాళ్లవన్నీ వట్టి మాటలు, గారడీలేనని విమర్శించారు.

సునీతారెడ్డిని గెలిపించాలి : బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్

కొల్చారం(నర్సాపూర్): ఈ ఎన్నికలలో నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్ ఓటర్లను కోరారు. శనివారం మండల పరిధిలోని రంగంపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు.

తిరుమలాపూర్‌లో

నర్సాపూర్ రూరల్: మండలంలోని తిరుమలాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీశైలంరెడ్డి, సర్పంచ్ కవితల ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి తరఫున మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం శనివారం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన నేతలు సునీతారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

కొత్తచెరువుతండాలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువు తండా పంచాయతీ మహ్మద్‌నగర్‌గేట్ తండాలో సునీతారెడ్డిని గెలిపించాలని నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు.

ప్రతిగడపకూ దరిచేరిన పథకాలు

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతూ స్వాగతిస్తున్నారని రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా హత్నూర మండలం కాసాల, దేవులపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం

- పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



హవేళిఘణాపూర్: ప్రచారంలో పద్మా దేవేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు తిరిగి కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను మరోమారు అధికారంలోకి తీసుకురావాలని పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ర్యాలమడుగు, పేరూర్, మాచవరం మంభోజిపల్లి, హవేళిఘణాపూర్ శాలిపేట, బీబీపూర్, ఔరంగాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం చేపట్టిన ఫలితాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ నియోజకవర్గంలో గొడవలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రజలను ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. గతంలో నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా ఉండేవారని చెప్పారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు రోహిత్‌ను కాంగ్రెస్ తరఫున బరిలో ఉంచి నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. అనంతరం మంభోజిపల్లిలో గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, ఎంపీపీ యమున, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సుబ్బారావు, కిష్టయ్య, అంజాగౌడ్, సర్పంచ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం పాపన్నపేటలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటే దిక్కన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మిర్జాపల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు పోతరాజ్ రమణ, మాజీ ఎంపీపీ కర్రె కృపావతి కోరారు. శనివారం మండలంలోని మిర్జాపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమాతో పాటు ఇంటిముందు నల్లా నీరు, పంటలకు సాగునీరు అందిస్తున్న తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయరూ..



శేరిపల్లి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి

చిన్నశంకరంపేట(మెదక్): రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును బాగు చేయండని ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదని చిన్నశంకరంపేట ఉమ్మడి మండలంలోని శేరిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా అభ్యర్థులు హామీ ఇస్తున్నారే గానీ బీటీ రోడ్డుగా మార్చలేకపోయారని వాపోయారు. అసలే గుంతలు ఆపై వర్షం కురిస్తే ఇందులో నీరు నిండి ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. రోజూ మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే గ్రామస్తులకు ఇదే ప్రధాన సమస్యగా మారిందంటున్నారు. ఈ రహదారి గుండా రాత్రి సమయంలో గ్రామానికి వస్తున్నప్పుడు వాహన చక్రాలు గుంతలో పడి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలోకి వస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులను గ్రామస్తులు దీని గురించే ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థులు ఎన్నికల అనంతరం రోడ్డు బాగు చేయిస్తామని హామీ ఇస్తున్నారు.

చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అనిత

నర్సాపూర్: వృద్ధుల పట్ల అలసత్వం వహిస్తే చట్ట రీత్యా శిక్షకు గురవుతారని జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత హెచ్చరించారు. శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. తమ వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ విస్మరిస్తే వారసులకు సంక్రమించే స్థిర ఆస్తులను తిరిగి వారికే చట్టబద్ధంగా చెందుతాయని చెప్పారు. ప్రజలు సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కలిగియుండాలని తెలిపారు. తమ పిల్లలు ఆలనా పాలనా చూడటం లేదనే కేసులు వస్తున్నాయని, చట్టబద్ధంగా కాపాడాలని వస్తున్నారన్నారు. ఇలాంటి కేసుల్లో వారసులు చట్టం పరిధిలో శిక్షింపబడతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే.. మహాభాగ్యం



అంగన్‌వాడీలో నిర్వహిస్తున్న వైద్యపరీక్షలు

కౌడిపల్లి మండలంలోని రాజిపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆపై మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు రేణుక, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

పేదవిద్యార్థులకు ప్రోత్సాహం



పుస్తకాలు అందజేస్తున్న జీఎమ్మార్ ప్రతినిధులు

పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రోత్సహిస్తున్నామని జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం కాంపిటేటివ్ పుస్తకాలను శనివారం అందజేశారు. వారికి అవసరమయ్యే సదుపాయాలను సైతం సంస్థ కల్పిస్తోందన్నారు.

– మనోహరాబాద్(తూప్రాన్)

పాఠశాలల్లో మాక్ పోలింగ్



రామాయంపేట: స్లిప్పులు చూపుతున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు

రేగోడ్(మెదక్): మోడల్ స్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు విద్యార్థులు నామినేషన్లు వేశారు. మొత్తం 533 ఓట్లు పోలయ్యాయి. అందులో 247 ఓట్లతో సాయిమణి గెలుపొందారు. నోటాకు 19 ఓట్లు పోలయ్యాయి. 8 ఓట్లు చెల్లలేదని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు చాలా కీలకమైందన్నారు. వాటి గురించి పాఠశాల దశలోనే అవగాహన కల్పించడం ద్వారా అందరూ ఓటర్లుగా నమోదు చేసుకొని భవిష్యత్‌లో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అఖిల్, మాధవి, నాగమణి, విఠల్, యాదుల్, శోభ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాయంపేటలో

రామాయంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలో ఉన్న మొత్తం 313 విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మాక్ పోలింగ్ జరిగింది. విద్యార్థులు పోలింగ్ అధికారులుగా ప్రిసైడింగ్ అధికారులుగా, పోలింగ్ ఏజెంట్లుగా తమ బాధ్యతలు నిర్వర్తించారు. మహిళా పోలీసులుగా పలువురు విద్యార్థినులు వ్యవహరించారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాధాకిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు.



రామాయంపేట: ఓటు వేస్తున్న విద్యార్థిని

వెల్దుర్తిలో..

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీలో నిలిచిన 10 మంది విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా ఓటు వేశారు. హెచ్‌ఎం యాదగిరి పర్యవేక్షణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కొనసాగించారు. 2 గంటల అనంతరం కౌంటింగ్ చేపట్టి గెలుపొందిన వారికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో బాల్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు కొన్యాల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని క్షీరసాగర్‌లో కాంగ్రెస్ నాయకులు రవి, రాజుతో పాటు పలువురు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తారక సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జిల్లా కమిటీ ఏర్పాటు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని అన్ని మండల శాఖలను ఏకతాటిపై తెచ్చి నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేస్తామని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించి భవనం నిర్మించాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదగిరి, శేఖర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు తీరని అన్యాయం

దుబ్బాక: బహుజన నాయకులను ముఖ్యమంత్రిని చేసే పార్టీకే ముదిరాజ్ సంఘం సభ్యులు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పరి నారాయణ అన్నారు. శనివారం పట్టణంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో ముదిరాజ్‌లకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు.

కాకతీయ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

సంగారెడ్డి: కాకతీయ బ్యాంక్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి బ్రాంచ్‌లో శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎండీ సంజీవరెడ్డి మాట్లాడారు. కాకతీయ బ్యాంకు స్థాపించిన నాటి నుంచి ఖాతాదారులకు సేవలందించడం గర్వంగా ఉందన్నారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్రత్యేకంగా డిపాజిట్ స్కీంలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కనీస డిపాజిట్ రూ.10 లక్షలు, 37 నెలల కాలపరిమితికి 10 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. లాకర్స్ సదుపాయం ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ జి.మొగులయ్య, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఆదరణ

మనోహరాబాద్(తూప్రాన్): ఊరూరా ప్రజలు కాంగ్రెస్ రావాలి ఇందిరమ్మ రాజ్యం కావాలంటున్నారని పార్టీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలోని గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. నిరుద్యోగ యువత, మహిళలు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లిన కాంగ్రెస్‌కే తమ ఓటు అంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీలో చేరికలు**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామానికి చెందిన కందాడై అచ్యుతరామన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. నాయకులు యాదగిరి, రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లోనూ..**

నారాయణఖేడ్: మండల పరిధిలోని అంత్వార్‌కు చెందిన బీఆర్‌ఎస్ చెందిన నాయకుడు, సీనియర్ న్యాయవాది సంగమేశ్వర్‌రెడ్డితో పాటు గంగ్‌శెట్టి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మండలంలోని మాణిక్‌నాయక్ తండాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **స్తంభాన్ని ఢీకొన్న లారీ**

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లో చెరుకు తరలిస్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో 11కేవీ విద్యుత్‌వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. దీంతో మంగల్‌పేట్‌తో పాటు పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు కాలనీలు అంధకారంగా మారాయి. చెరుకు లారీలు ప్రతీ ఏడు విద్యుత్ స్తంభాలను ఢీకొనడం, వైర్లుతెగడం సర్వసాధారణంగా మారింది. బైపాస్ గుండా చెరుకు లారీలు వెళ్లకుండా ప్రధాన రహదారి గుండా వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

◆ **భక్తితోనే ముక్తి**

మునిపల్లి(అందోల్): భక్తితో ముక్తి పొందాలని నర్సాపూర్ మండలంలోని నృసింహపూరం ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్య పాదరాజయోగి వెంకటస్వామి ఉపదేశించారు. ఆత్మానందాశ్రమంలో పీఠాధిపతి వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు భానుప్రకాష్ పాల్గొన్నారు.

◆ **పోలింగ్ కేంద్రాల పరిశీలన**

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచ్చర్ల, దౌల్తాబాద్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మెదక్ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

జిన్నారంలో..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల, బొంతపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకులు నిజాంజైఖా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.

జహీరాబాద్‌లో పోలీసు కవాతు



పట్టణంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఎన్నికల నేపథ్యంలో శనివారం కవాతు నిర్వహించారు. అల్లీపూర్, ఫయాజ్‌నగర్, పుగట్ నగర్, మూసానగర్ కాలనీలతో పాటు చిన్న హైదరాబాద్ గ్రామంలోనూ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

– జహీరాబాద్